క్లుప్తంగా

అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు



డీఆర్వోకు వినతిపత్రాన్ని అందిస్తున్న సామాజిక చైతన్య వేదిక ప్రతినిధులు

తిరుపతి అర్బన్: జిల్లాలోని పలు చోట్ల అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయని, అక్కడ చాలీచాలని వసతుల నడుమ సమస్యలు ఎదురవుతున్నట్టు సామాజిక చైతన్యవేదిక ప్రతినిధులు డీఆర్వో పెంచలకిషోర్‌కు విన్నవించారు. ఈ మేరకు సోమవారం గ్రీవెన్స్ సందర్భంగా కలెక్టరేట్‌లో వారు ఏయే పాఠశాలల్లో ఎలాంటి సమస్యలున్నాయో వివరించారు. మిని అంగన్‌వాడీ స్కూల్స్‌ను మేజర్ అంగన్‌వాడీ స్కూల్స్‌గా మార్పు చేయాలని కోరారు. రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలాల్లోని పాఠశాలల అభివృద్ధికి తాము చేసిన కృషిని వివరించారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మహేష్ మృతదేహం

ఏర్పేడు: మండలంలోని పల్లం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా మరొకరు గాయపడినట్టు సీఐ శ్రీరామశ్రీనివాసులు తెలిపారు. సీఐ కథనం.. మండలంలోని చింతలపాళెం గ్రామానికి చెందిన మహేష్(25), వెంకటేష్(28) ట్రాక్టర్‌లో పల్లం నుంచి చింతలపాళెంకు వెళ్తుండగా పల్లం సమీపంలో వెంకటగిరి నుంచి ఏర్పేడుకు వెళుతున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో మహేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటేష్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ రోహిత్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ చెప్పారు.

అమ్మో.. గ్రీవెన్స్

- మూడు దశల్లో తనిఖీలు
- అధికారులను కలవడం గగనమే
- ప్రజాసమస్యల పరిష్కార వేదికపై అసంతృప్తి

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజాసమస్యల పరిష్కార వేదికపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులను కలవాలంటే సామాన్యులకు గగనంగా మారుతోంది. కాస్త పలుకబడి, అధికార పార్టీకి చెందిన వారు నేరుగా అధికారులను కలిసి సమస్యలు విన్నవిస్తున్నారు. ఇక సామాన్యులు, వృద్ధులు, దివ్యాంగులైతే గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. దీనికి తోడు పోలీసుల ఓవరాక్షన్ మరింత ఇబ్బందికరంగా మారుతోంది. గతంలో అర్జీలను రాయడానికి అప్పటి కలెక్టర్ వెంకటరమణారెడ్డి కొందరు వీఆర్వోలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం తూతూమంత్రంగా వీర్వోలు విధులు నిర్వహిస్తున్నారు. ముందుగా కలెక్టరేట్‌లో అర్జీ చూపించి టోకెన్ నంబర్ వేయించుకోవాలి. లేకుంటే అక్కడున్న వీఆర్వోల చెంత అర్జీలు రాయించుకోవాలి. అయితే అక్కడ అవసరమైన మేరకు వీఆర్వోలు లేకపోవడంతో అర్జీదారులే అర్జీలు రాసుకుని టోకెన్ నంబర్ వేసుకుని వెళ్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు ముందుగా మెటల్‌డిటెక్టర్స్‌తో, ఆ తర్వాత కౌంటర్‌లో అర్జీలను కంప్యూటర్‌లో ఫీడింగ్ చేసేటప్పుడు, మళ్లీ గ్రీవెన్స్ హాల్ నుంచి అధికారుల వద్దకు వెళ్లేటప్పుడు ఇలా మూడు సార్లు తనిఖీలు చేస్తున్నారు. కాస్తా రాజకీయ పలుకుబడి ఉన్నోళ్లు, అధికార పార్టీకి చెందిన వారు నేరుగా వెళ్లి అర్జీలను కలెక్టర్‌తోపాటు ఇతర అధికారులకు అందిస్తున్నారు. ఈ క్రమంలో వృద్ధులు, వికలాంగులు, సామాన్య గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది.

మధ్యాహ్నం 2.15 వరకు గ్రీవెన్స్

సాధారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్రీవెన్స్(ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమాన్ని ముగించాల్సి ఉంది.



నేరుగా వెళుతున్న రాజకీయ పలుకుబడి ఉన్నవారు

అయితే సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2.15 గంటల వరకు నిర్వహించారు. రాజకీయ పలుకుబడి ఉన్న వారు ముందుగా వెళ్లి గంటల కొద్దీ సమస్యలు చెప్పుకోవడంతో సామాన్యులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. దీనికితోడు తాగునీటి సౌకర్యం కూడా లేకపోవడంతో ఫిర్యాదుదారులు గొంతు తడుపుకోవడానికి నానా ఇక్కట్లు పడాల్సి వచ్చింది.

మళ్లీ జెడ్పీ చాంబర్‌కు గ్రీవెన్స్ మార్పు

2022 ఏప్రిల్ 4వ తేదీన తిరుపతి జిల్లా కలెక్టరేట్ ఏర్పాటైంది. అప్పటి నుంచి కలెక్టరేట్‌లోనే కింది భాగంలోని హాల్‌లో గ్రీవెన్స్ నిర్వహించే వారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమీపంలోని జిల్లా పరిషత్ కార్యాలయం కోసం ఏర్పాటు చేసిన చాంబర్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని చేపట్టారు. ఇక్కడ రీసౌండ్, ఇతర అసౌకర్యాల కారణంగా ఫిర్యాదుదారులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.



గంటల కొద్దీ నిరీక్షిస్తున్న సామాన్యులు, వృద్ధులు, దివ్యాంగులు



మూడో దశ(గ్రీవెన్స్ గేటు)వద్ద పోలీసులు

ప్రతి సమస్యకు పరిష్కారం



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 146 అర్జీలు వచ్చాయన్నారు. ఇందులో 112 అర్జీలు రెవెన్యూకు సంబంధించినవి ఉన్నాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన రోజు నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 625 అర్జీలు వచ్చాయని, అందులో ఇప్పటి వరకు 285 అర్జీలకు పరిష్కారం చూపించామని తెలిపారు. డీఆర్వో పెంచల కిషోర్, డిప్యూటీ కలెక్టర్లు మురళి, దేవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు

తిరుపతిలో ట్రయింఫ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభం



ట్రయింఫ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డీటీవో ఆదినారాయణ, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: రేణిగుంట రోడ్డులో ఏర్పాటు చేసిన ట్రయింఫ్ తిరుపతి ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీటీవో జి.ఆదినారాయణ మాట్లాడుతూ ఔత్సాహిక రైడర్లు, బలమైన బైకింగ్ సంస్కృతిని, బలమైన కమ్యూనిటీని పెంపొందించడానికి ట్రయింఫ్ బ్రాండ్ సరైన ఎంపికగా నిలుస్తుందన్నారు. ప్రోబైకింగ్ సర్కిల్ హెడ్ గౌతమ్ మోదీ, రీజనల్ మేనేజర్(సర్వీస్) సౌత్–1 నీరజ్‌తివారి, ఏరియా సేల్స్ మేనేజర్ రాజీవ్ కన్నన్, ఏరియా సర్వీస్ మేనేజర్ ప్రభు, గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌దేవ్ ప్రసంగించారు. కొత్త ట్రయింఫ్ యజమానులు తమ బైక్‌లను ఒరిజినల్ ట్రయింఫ్ ఎక్సస‌రీస్‌తో తమకు కావాల్సిన రీతిలో మార్చుకోవచ్చన్నారు. స్టీరింగ్ సౌకర్యం నుంచి సామాను, భద్రత వరకు బైక్‌ను విస్తృత శ్రేణి రైడర్‌ల అవసరాలకు అనుగుణంగా చేసుకోవచ్చని తెలిపారు. కొత్త కస్టమర్లు 16,000 కిలోమీటర్ల సర్వీస్ సేవలు, రెండేళ్ల పరిమిత మైలేజ్ వారంటీ, మరో మూడేళ్ల పొడిగించిన వారంటీని సైతం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రయింఫ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 30 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 75,963 మంది స్వామిని దర్శించుకున్నారు. 26,956 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.99 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని వారికి 18 గంటల్లో దర్శనం లభిస్తోంది.



భాకరాపేట కనుమలో లారీ బోల్తా





ప్రమాదంలో దెబ్బతిన్న ఇన్నోవా కారు, లగేజీ ఆటో (ఇన్‌సెట్) మృతి చెందిన లారీ క్లీనర్ అల్తాఫ్

- క్లీనర్ మృతి
- మరో నలుగురికి గాయాలు

చంద్రగిరి: భాకరాపేట కనుమలో ఓ లారీ బీభత్సం సృష్టించింది. ముందు వెళ్తున్న కారు, టమాటా లోడ్డుతో వెళ్తున్న ఆటోను ఢీకొట్టి, పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో క్లీనర్ మృతి చెందగా, డ్రైవరుతో పాటు మరో ముగ్గురు గాయాలపాలైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మధ్యప్రదేశ్ నుంచి తిరుపతికి ఓ లారీ సున్నం లోడ్డుతో వస్తోంది. సోమవారం మధ్యాహ్నం భాకరాపేట కనుమలో వస్తున్న క్రమంలో లారీ అదుపు తప్పి టమాట లోడ్డుతో ముందు వెళ్తున్న లగేజీ ఆటోను, ధర్మవరం నుంచి తిరుపతికి వస్తున్న ఇన్నోవా కారును ఢీకొట్టింది. దీంతో కారు లోయలోకి దూసుకెళ్లింది. అనంతరం లారీ పీటీసీ సమీపంలోని పెద్ద మలుపు వద్ద చెట్లలోకి దూసుకెళ్లి పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ నుజ్జునుజ్జుకాగా, లారీ క్లీనర్ అల్తాఫ్(33) అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవరు అబ్దుల్లాకు తీవ్ర గాయాలయ్యాయి. ఇన్నోవాలోని బాలమురళీకృష్ణ, చంద్రశేఖర్‌మౌళి, వెంకటశివ గాయపడ్డారు. ఆటోలోని దంపతులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. మృతి చెందిన అల్తాఫ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. లారీలో సున్నపు లోడ్డు పరిమితికి మించి ఉండటంతోనే వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురైనట్లు ప్రయాణికులు భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి అదే కోణంగా విచారణ చేస్తున్నారు.

కలెక్టరేట్‌లో ఆగిన లిఫ్ట్

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10.50 గంటలకు లిఫ్ట్ ఆగిపోయింది. దీంతో వివిధ సమస్యల కోసం వచ్చిన జిల్లా ప్రజలతో పాటు ఉద్యోగులు తిప్పలు పడాల్సి వచ్చింది. తిరుపతి కలెక్టరేట్ కార్యాలయం ఏడు అంతస్తులు ఉంది. ఒక్కో అంతస్తులో మూడు నుంచి నాలుగు కార్యాలయాలు ఉన్నాయి. ఒక్కో కార్యాలయంలో 10 నుంచి 20 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. కలెక్టరేట్‌లో ఏ, బీ పేరుతో రెండు బ్లాక్‌లు ఉన్నాయి. ఒక్కో బ్లాక్‌కు రెండు లిఫ్ట్‌లు ఏర్పాటు చేశారు. లిఫ్ట్ పనిచేస్తేనే వృద్ధులైన పలువురు ఉద్యోగులు తమ కార్యాలయానికి వెళ్లగలుగుతారు. లేదంటే కిందే ఉండిపోతారు. అయితే సోమవారం బీ బ్లాక్‌కి చెందిన ఓ లిఫ్ట్ ఓపెన్ అయిన తర్వాత ఆగిపోయింది. బీ బ్లాక్‌లో ఒక లిఫ్ట్ ఆగిపోవడంతో మరోలిఫ్ట్ రద్దీగా మారింది. గ్రీవెన్స్‌కు వచ్చిన పలువురు కలెక్టరేట్ ఏవో జయరాములకు సమాచారం ఇచ్చారు. ఆయన లిఫ్ట్‌ను పరిశీలించారు. ఎవర్నీ లోనికి వెళ్లకుండా రెండు రాండ్లు అడ్డుగా పెట్టి వెళ్లిపోయారు.



బీ బ్లాక్‌లోని ఎడమ వైపు ఉన్న లిఫ్ట్ వద్ద రద్దీ



బీ బ్లాక్‌లో ఆగిన కుడి వైపున ఉన్న లిఫ్ట్

తర్వాత 1.30 గంటలకు మరమ్మతులు చేయించారు. ఇటీవల ఒక రోజు విద్యుత్ అంతరాయం చోటుచేసుకుంది. ఆ రోజు ఉద్యోగులు మెట్లు ఎక్కి పైకి వెళ్లలేక కిందే ఉండి తమ కార్యకలాపాలను నిర్వహించారు.

టిప్పర్ ఢీకొని మహిళ మృతి



మృతి చెందిన ఉమా

సత్యవేడు: పట్టణంలోని స్టేట్ బ్యాంకు సమీపంలో సోమవారం మధ్యాహ్నం నేతాజీ రోడ్డుపై టిప్పర్ ఢీకొని ఓ మహిళ మృతిచెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది. వివరాలు.. పంచాయతీ పరిధిలోని ఊళవచేనులో కే.ఉమా, ప్రేమ్‌నాథ్ దంపతులు నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇందులో అనిల్ 6వ తరగతి, జీవన్ ఒకటో తరగతి చదువుతున్నారు. చిన్న అబ్బాయి ఓ ప్రయివేటు స్కూల్‌లో చదువుతుండగా.. సోమవారం మధ్యాహ్నం ఉమా(35) పిల్లవాడికి భోజనం పెట్టి తిరిగి ఇంటికి నడుచుకుంటూ వస్తోంది. స్టేట్ బ్యాంక్ సమీపంలో వెనుక వైపు నుంచి ఉమాను ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ వీరాంజనేయులు తెలిపారు.

పరిహారం ఇవ్వండి



వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న ఆర్.మల్లవరం విద్యార్థుల తల్లిదండ్రులు

తిరుపతి అర్బన్: రేణిగుంట మండలంలోని ఆర్.మల్లవరం ప్రాథమిక పాఠశాల భవనం పుతలపట్టు–నాయుడుపేట హైవే రహదారి విస్తరణలో భాగంగా తొలగించారని, పాఠశాల భవనానికి పరిహారం కింద రూ.14 లక్షలు ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదని రేణిగుంట మండలం ఆర్ మల్లవల్లరానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు. ఈ క్రమంలో అద్దె భవనంలో పాఠశాల నిర్వహిస్తున్నారని తెలిపారు. పాఠశాలలో 30 మంది విద్యార్థులుండగా.. పాఠశాల భవన నిర్మాణానికి ఓ దాత స్థలాన్ని విరాళంగా అందించారని, కానీ నిధులు లేక నిర్మాణం చేపట్టలేకపోతున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించారు.

తిరుపతి పర్యాటక అభివృద్ధికి కమిటీ వేశారా?

పార్లమెంటులో ఎంపీ గురుమూర్తి



తిరుపతి మంగళం : తిరుపతి అభివృద్ధికి కమిటీ వేశారా అని ఎంపీ గురుమూర్తి పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం పార్లమెంటు సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ తిరుపతిని అభివృద్ధి చేయడానికి కేంద్రప్రభుత్వం వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలతో కూడిన సహకార కమిటీని ఏర్పాటు చేసిందా? అలా అయితే అందుకు సంబంధించిన వివరాలు తెలపాలని కోరారు. దీనికి కేంద్ర పర్యాటక శాఖామంత్రి గజేంద్ర సింగ్ షేఖావత్ సమాధానమిస్తూ ఇప్పటి వరకు పర్యాటక మంత్రిత్వ శాఖ కింద అలాంటి కమిటీ లేదని మార్గదర్శకాల ప్రకారం, స్వదేశ్ దర్శన్ 2.0 ప్రసాద్ పథకాలు జాతీయ స్టీరింగ్ కమిటీ, సెంట్రల్ సాంక్షనింగ్–మానిటరింగ్ కమిటీ, మిషన్ డైరెక్టరేట్ ఏర్పాటుకు నిబంధనలను కలిగి ఉన్నాయని తెలిపారు. అందులో వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, వాటాదారుల సహకార ఇన్‌పుట్‌లు తీసుకుంటాయని చెప్పారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించండి

తిరుపతి పార్లమెంట్ పరిధిలోని మత్స్యకారుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని ఎంపీ మద్దిల గురుమూర్తి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. తిరుపతి పార్లమెంట్ పరిధిలో 75 కిలోమీటర్ల సముద్రతీర ప్రాంతంతోపాటు ప్రముఖ ఉప్పునీటి సరస్సు పులికాట్ పరిధిలో సుమారు 20 వేల మంది మత్స్యకారులు నివసిస్తున్నారని ఆయన తెలిపారు. వారు ఆర్థికంగా వెనుకబడిన వారని, చిన్న 5 హెచ్‌పీ మోటారు బోట్లను ఉపయోగించడం ద్వారా వారి జీవనోపాధి కోసం సంప్రదాయ పద్ధతులపై ఆధారపడి ఉన్నారని వివరించారు. గత 20 సంవత్సరాలుగా పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, పుదుచ్చేరి మత్స్యకారులతో వారు సమస్యలను ఎదుర్కొంటున్నారని సభ దృష్టికి తీసుకెళ్లారు. పొరుగు రాష్ట్రాల మత్స్యకారులు 400, 500 హెచ్‌పీ ఇంజిన్ సామర్థ్యం కలిగిన భారీ మెకనైజ్డ్ బోట్లతో అక్రమంగా రిజర్వ్‌డ్ జోన్‌లోకి ప్రవేశించి స్థానిక మత్స్యకారుల పడవలు, వలలను ధ్వంసం చేస్తున్నారని తెలియజేశారు. ఈ ప్రాంతంలోని మత్స్యకారులపై ఆయుధాలతో దాడి చేస్తున్నారని వివరించారు. ఇది రెండు రాష్ట్రాల మధ్య సున్నితమైన శాంతిభద్రతల సమస్య అయినందువల్ల, దీర్ఘకాల సమస్యలను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించారు.

కల్తీ నెయ్యిపై టీటీడీ ఈఓ ఆగ్రహం

తిరుమల: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాలు మరింత నాణ్యంగా, రుచికరంగా అందించాలనే లక్ష్యంతో, తక్కువ నాణ్యత గల నెయ్యిని సరఫరా చేస్తున్న సరఫరాదారులకు టీటీడీ తీవ్రమైన హెచ్చరిక చేసింది. తిరుపతి టీటీడీ పరిపాలనా భవనంలోని ఈవో చాంబర్‌లో సోమవారం సాయంత్రం టీటీడీ ఈవో జె శ్యామలరావు, జేఈవో గౌతమి (ఆరోగ్య, విద్యాశాఖ) నెయ్యి సేకరణ నిపుణుల కమిటీతో సమీక్షా సమావేశం నిర్వహించారు. టీటీడీకి సరఫరా చేస్తున్న నెయ్యి నమూనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసేందుకు నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్‌కు పంపినట్లు ఈఓ తెలిపారు. టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తున్న ఐదుగురు సరఫరాదారుల్లో ఒకరు అందించిన నెయ్యి నాణ్యత ప్రమాణాలు సరిపోలడం లేదని, కల్తీ నెయ్యిని సరఫరా చేస్తున్నట్లు పరీక్షల్లో నిర్ధారణ అయినట్లు తెలిపారు. టెండరు నిబంధనలను ఉల్లంఘించినందుకు సరఫరాదారుని బ్లాక్ లిస్ట్ చేసేందుకు షోకాజ్ నోటీసు కూడా జారీచేసినట్లు చెప్పారు. సరఫరాదారులు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఈవో హెచ్చరించారు.

రాజకీయ వేధింపులు తగవు



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నేతలు

తిరుపతి అర్బన్: టీడీపీ కూటమి నేతలు చిరుద్యోగులకు రాజకీయరంగు పులిమి రాజీనామా చేయాలంటూ అలజడి సృష్టిస్తున్నారని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మండిపడ్డారు. కలెక్టరేట్ వద్ద సోమవారం చిరుద్యోగులపై కూటమి నేతల వేధింపులకు నిరసనగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చోటామోటా నేతలు సైతం తాము అధికారంలోకి వచ్చామంటూ చిరు ఉద్యోగులపై ప్రతాపం చూపుతున్నారని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, సంఘమిత్రలు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిసెంట్లను ఉద్యోగం నుంచి తప్పుకోవాలంటూ ఒత్తిడి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు మంచి చేస్తారని ఎన్నుకుంటే ఇలా ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేయడం భావ్యం కాదని, తీరు మార్చుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం, కోశాధికారి కేఎస్ఎన్ ప్రసాదరావు, జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పీజీ పరీక్షా కేంద్రాల పరిశీలన



పీజీ పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో పీజీ కోర్సులకు సంబంధించి ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకామ్ రెండో సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పరీక్ష కేంద్రాలను సోమవారం నూతన వీసీ సీహెచ్ అప్పారావు పరిశీలించారు. పరీక్షల నిర్వహణపై వర్సిటీ అధికారులను అభినందించారు.

31 నుంచి శ్రీకోదండరాముడి పవిత్రోత్సవాలు

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామి వారి ఆలయంలో ఈ నెల 31 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు స్వామి వారి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు 30వ తేదీ సాయంత్రం అంకురార్పణతో ఈ ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఆలయంలో ఏడాదిలో చేపట్టిన వివిధ కార్యక్రమాల్లో తెలిసీ తెలియక జరిగే దోషాల కారణంగా ఆలయ పవిత్రతకు లోపం రాకుండా ప్రతి ఏటా మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గృహస్తులు ఇద్దరు రూ.500 చెల్లించి పవిత్రోత్సవాల్లో పాల్గొనవచ్చు.

క్లుప్తంగా

మతసామరస్యానికి ప్రతీక 'ఉరుసు'


చెవిరెడ్డిని ఆశీర్వదిస్తున్న మత గురువు

పాకాల: మత సామరస్యానికి ప్రతీకగా ఉరుసు ఉత్సవం నిలుస్తుందని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. సోమవారం పాకాలలో నిర్వహిస్తున్న 104 హజరత్ షేక్ ఫరీద్ మస్తాన్ ఔలియా వారి ఉరుసులో ఆయన పాల్గొన్నారు. చెవిరెడ్డి మాట్లాడుతూ హిందూ, ముస్లింలు ఐక్యంగా ప్రార్థనలు నిర్వహించడం ఉరుసు ప్రత్యేకతన్నారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం మత గురువులు ఆయనకు ఆశీస్సులు అందించారు.

ఆది గురువు వ్యాస మహర్షి

తిరుపతి సిటీ: ప్రపంచానికి వ్యాసమహర్షి ఆదిగురువుగా నిలిచారని ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. సోమవారం కళాశాలలో గురుపూర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు జ్ఞానాన్ని బోధించి, వారి ఉన్నతికి నిరంతరం కృషి చేసే ఏకైక వ్యక్తి గురువేనని వెల్లడించారు. గురువులను గౌరవించడం ప్రతి విద్యార్థి అలవరుచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పరమేశ్వర, అధ్యాపకులు కొండలరావు, వసంతకుమారి, శివకుమార్ పాల్గొన్నారు.

ఎస్వీయూ రిజిస్ట్రార్‌కు సత్కారం


రిజిస్ట్రార్‌ను సన్మానిస్తున్న తిప్పారెడ్డి

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ భూపతినాయుడును సోమవారం నగరంలోని అంబేడ్కర్ లా కాలేజ్ చైర్మన్ డాక్టర్ తిప్పారెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ మేరకు వర్సిటీ పరిపాలనాభవనంలో రిజిస్ట్రార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు.

సీఐకి బెయిల్‌బుల్ వారెంట్

తిరుపతి లీగల్: ఓ క్రిమినల్ కేసులో దర్యాప్తు అధికారిగా ఉండి సాక్ష్యం చెప్పడానికి కోర్టుకు హాజరు కానందున సీఐ సుబ్రమణ్యంరెడ్డికి బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేస్తూ తిరుపతి ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వై.సరిత సోమవారం ఆదేశాలు జారీ చేశారు. తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 2022 జూన్ 29వ తేదీన తిరుపతి రూరల్, సాయినగర్ పంచాయితీ, జయనగర్‌లోని ఓ ఇంటిలో రెండు సెల్ ఫోన్లు, ఓ ల్యాప్‌టాప్ కీ బోర్డు, రూ.6వేల నగదు అపహరణకు గురైంది. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు అప్పటి తిరుచానూరు సీఐ వి.సుబ్రమణ్యంరెడ్డి కేసు దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. ఆ కేసు విచారణ జరుగుతోంది. ఈ మేరకు సీఐ సుబ్రమణ్యంరెడ్డి కోర్టుకు హాజరై సాక్ష్యం చెప్పాలని ఇది వరలో కోర్టు సమన్లు పంపింది. అయితే ఆయన ఎంతకాలమైనా కోర్టుకు హాజరు కాకపోవడంతో సీఐకి బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేస్తూ న్యాయమూర్తి ఆదేశాలు చేశారు. కేసును ఈనెల 26వ తేదీకి వాయిదా వేశారు.

రూ.10వేల ఆర్థిక సాయం

తిరుపతి కల్చరల్: అనారోగ్యానికి గురై శస్త్రచికిత్స చేయించుకున్న మెకానిక్ మురుగాకు తిరుపతి టూవీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు మల్లీశ్వర్, గురువాచారి, కమిటీ ఇన్‌చార్జి సోమశేఖర్, ఎలక్ట్రికల్ ఇన్‌చార్జి విక్కీ రమేష్ పాల్గొన్నారు.

ముగిసిన కావమ్మ ఉత్సవాలు

తిరుపతి కల్చరల్: నగరంలోని జ్యోతి థియేటర్ వద్ద ఉన్న కావమ్మ ఆలయంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు కట్టా జయరామ యాదవ్, అధ్యక్షుడు ఆర్.సుబ్రమణ్యం, బండి మణి, కట్టా మోహన్ పాల్గొన్నారు.

అవగాహనతో క్యాన్సర్ నిర్మూలన

తిరుపతి కల్చరల్: అవగాహనతో క్యాన్సర్ మహమ్మారిని నిర్మూలించాలని టాటా ట్రస్ట్ అధికారి హేమంత్ పిలుపు నిచ్చారు. సోమవారం వినాయకనగర్‌లోని రాస్ క్లస్టర్‌లో మహిళలకు ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పొగాకు, గుట్కా, మద్యపానం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మహిళల్లో గర్భసంచి, రొమ్ముక్యాన్సర్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని పరీక్షలు చేసుకుంటూ ప్రాథమిక స్థాయిలోనే చికిత్స చేయించుకుంటే వ్యాధిని జయించవచ్చని సూచించారు. మహిళలకు క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. రాస్ సిబ్బంది రామానుజులు, పద్మావతి, నాగేశ్వరరావు, వెంకయ్యబాబు, అమరావతి పాల్గొన్నారు.

సమస్యల వలయంలో విశ్వవిద్యాలయాలు

ఎస్వీ వెటర్నరీ వర్సిటీలోని వైఎస్సార్ పరిపాలనా భవనం


ఎస్వీయూ పరిపాలనా భవనం


ఆధ్యాత్మిక తిరునగరం చదువుల నిలయంగా విలసిల్లేది. ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాలతో భాసిల్లేది. అయితే రాజకీయ నాయకుల రంగ ప్రవేశంతో యూనివర్సిటీల ప్రభ మసకబారుతోంది. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరింతగా దిగజారుతోంది. టీడీపీ నేతల దౌర్జన్యకాండతో వర్సిటీల్లో పాలన పూర్తిగా గాడి తప్పింది. ఈ క్రమంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఇన్‌చార్జి వీసీ.. రిజిస్ట్రార్లపై పెను భారం పడుతోంది. స్వాగతం పలుకుతున్న సమస్యలను పరిష్కరించడం తలకు మించిన పనిగా మారుతోంది. ఇదే సమయంలో ఉద్యోగులు.. విద్యార్థుల పరిస్థితి సైతం అగమ్యగోచరంగా తయారైంది.

- వర్సిటీల్లో గాడి తప్పిన పాలన
- వసతులు లేక ఇబ్బందిపడుతున్న విద్యార్థులు
- నాసిరకం భోజనం తినలేక ఇక్కట్లు
- చివరకు తాగునీటికి కూడా అవస్థలు
- రోజురోజుకూ పెరుగుతున్న బయటి వ్యక్తుల ఆగడాలు
- హాస్టళ్లలో మకాం వేసిన ఆకతాయిలు
- అధికారుల నిర్లక్ష్యంతో తగ్గుతున్న అడ్మిషన్లు

తిరుపతి సిటీ: తిరుపతిలోని యూనివర్సిటీల్లో కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఇన్‌చార్జి వీసీ, రిజిస్ట్రార్‌లకు పలు సవాళ్లు కనిపిస్తున్నాయి. గత రెండు నెలలుగా వర్సిటీలలో పాలన పడకేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి టీడీపీ, జనసేన నేతలు విచ్చలవిడిగా రెచ్చిపోయి వీసీ, రిజిస్ట్రార్‌లతో రాజీనామాలు చేయించడంతో పాలన పూర్తిగా స్తంభించింది. అత్యవసర ఫైల్స్ ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. దీంతో ఉద్యోగుల పెన్షన్లు, జీతభత్యాలతో పాటు 2024–25 అకడమిక్ ఇయర్ అడ్మిషన్ల ప్రక్రియపై సైతం ప్రభావం పడింది. వర్సిటీ పరిధిలోని పలు డిగ్రీ, పీజీ కళాశాలల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్లు విడుదల చేయడంలో జాప్యం ఏర్పడింది. గత నెల 27వ తేదీన పీజీ సెట్–2024 ఫలితాలు విడుదలైనా ఇప్పటివరకు పీజీ అడ్మిషన్ల కౌన్సిలింగ్ ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్ ఊసే లేదు. ఇక వర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, టైంస్కేల్ ఉద్యోగుల సమస్యలు సరేసరి. వర్సిటీలలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన శాశ్వత అధ్యాపక పోస్టుల నియామక ప్రక్రియకు ఉన్నత విద్యామండలి క్లాం వేసినట్లు తెలుస్తోంది. దీంతో వేలాది మంది నిరుద్యోగులు ప్రైవేటు సంస్థల్లో రూ.లక్షలు వెచ్చించి కోచింగ్ తీసుకుని నియామక ప్రక్రియ కోసం ఎదురుచూస్తున్నారు.

విద్యార్థుల అవస్థలు

ప్రధానంగా ఎస్వీయూ, ఎస్వీ వెటర్నరీ వర్సిటీ, మహిళా వర్సిటీ వసతిగృహాలలో విద్యార్థులు నాసిరకం ఆహారం తినలేక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఇప్పటికే పలు మార్లు రోడ్డెక్కి ధర్నాలు, నిరసనలు చేశారు. వర్సిటీ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. హాస్టళ్లలో మరుగుదొడ్ల పరిస్థితి దయనీయంగా ఉందని, పైప్‌లైన్ల లీకేజీ కారణంగా నీరు కూడా సరిగా రావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెస్ బిల్లులు మాత్రం ఒక్కొక్కరి నుంచి సుమారు రూ. 3వేలకు పైగా ముక్కుపిండి వసూలు చేస్తున్నారని మండిపడుతున్నారు. వర్సిటీ అధికారులు క్రమం తప్పకుండా వసతిగృహాలను తనిఖీలు చేసి వారంలో ఒక్కరోజైన ఇక్కడ వడ్డిస్తున్న భోజనం తింటే ఆహార నాణ్యత తెలుస్తుందని వెల్లడిస్తున్నారు.

దాహంతో అలమటించాల్సిందే!

ఎస్వీయూ, వెటర్నరీ, మహిళా వర్సిటీలోకి వెళ్లాంటే వెంట వాటర్ బాటిల్ తీసుకెళ్లాల్సిందే. లేకుంటే దాహంతో అలమటించాల్సిన దుస్థితి. అడ్మిషన్ల కోసం, మార్కుల జాబితాలు, ప్రొవిజినల్, కాన్వొకేషన్ వంటి ధ్రువీకరణ పత్రాల కోసం రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వ్యయప్రయాసల కోర్చి విద్యార్థులు, తల్లిదండ్రులు నిత్యం వందల సంఖ్యలో వస్తుంటారు. కానీ, విచిత్రమేమిటంటే తాగేందుకు ఎక్కడా మంచినీరు దొరకదు. వర్సిటీ పరిపాలనా భవనానికి వచ్చే విజిటర్లు రోజూ ఇదే అంశంపై చర్చించుకుంటున్నారు. ఎస్వీయూలో మరీ ఈ సమస్య దారుణంగా ఉంది. పరిపాలనా భవనం రిసెప్షన్ సెంటర్ వద్ద తాగునీటి కోసం విద్యార్థుల పడే అవస్థలు వర్ణనాతీతం. క్యాంటిన్‌కు వెళదామంటే టీడీపీకి చెందిన రౌడీ మూక ఆగడాలకు అది కూడా మూత పడింది. దీంతో విజిటర్స్ పరిస్థితి దారుణంగా ఉంటోంది.

ఉద్యోగాల కల్పనలో విఫలం!

ఎస్వీయూనివర్సిటీ, మహిళా వర్సిటీలలో పలు కోర్సులలో ప్రవేశాల సంఖ్య క్షీణిస్తోంది. కొన్ని కోర్సులలో సింగిల్ డిజిట్‌కే అడ్మిషన్లు పరిమితమయ్యామంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇందుకు ప్రధాన కారణం వర్సిటీ అధికారుల నిర్లక్ష్యమనే చెప్పవచ్చు. అనుభవం కలిగిన అధ్యాపకులు, మౌలిక సదుపాయాలు, వందల ఎకరాల్లో విస్తరించిన భవనాలు, నాణ్యమైన బోధన ఈ వర్సిటీల సొంతం. కానీ కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి కల్పించడంలో వర్సిటీలు విఫలం చెందుతున్నాయి. దీంతో విద్యార్థులు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల వైపు మొగ్గు చూపుతున్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలలో పెద్ద సంఖ్యలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తుండటమే ఇందుకు ప్రధాన కారణం. ఆ దిశగా వర్సిటీలు అడుగులు వేస్తే తప్ప అడ్మిషన్ల సంఖ్య పెరిగే అవకాశం లేదు.

ఆకతాయిల ఆగడాలు

రాజకీయ నిరుద్యోగులు, ఆకతాయిలకు యూనివర్సిటీలు అడ్డాగా మారాయి. దీంతో ఉన్నత విద్యను అభ్యసించేందుకు వచ్చిన విద్యార్థులపై ఆ ప్రభావం పడుతోంది. వర్సిటీకి సంబంధంలేని, కోర్సులు పూర్తి చేసుకుని బయటి వెళ్లిన వారు సైతం తాను ఫలానా విద్యార్థి సంఘం నాయకుడినంటూ వర్సిటీలో కాలం గడుపుతున్నారు. ముఖ్యంగా ఎస్వీయూలో రాత్రి, పగలు తేడా లేకుండా అధికారులను బెదిరించి మరీ హాస్టళ్లలోనే మకాం వేస్తున్నారు. వారి ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. చదువుకునే విద్యార్థులను సైతం వారు మభ్య పెట్టి తప్పుదోవ పట్టిస్తున్నారు. వీరి విపరీత పోకడల కారణంగానే ప్రతిష్టాత్మక ఎస్వీయూలో నేడు అడ్మిషన్లు అంతంతమాత్రంగానే ఉన్నాయి. నూతన వీసీ, రిజిస్ట్రార్‌లు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి వర్సిటీకి సంబంధంలేని బయట వ్యక్తులను ముఖద్వారం సైతం తొక్కనీయకుండా కఠినంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

కేసులకు చెవిరెడ్డి కుటుంబం భయపడదు


మాట్లాడుతున్న చెంచు మోహన్‌యాదవ్

తిరుపతి: ''విద్యార్థి దశ నుంచి పోరాటం చేస్తూ రాజకీయాల్లోకి వచ్చిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి ఇప్పుడు పోలీసు కేసులకు భయపడతారా..? ఐదేళ్ల టీడీపీ ప్రభుత్వంలో 88 కేసులు పెట్టించుకుని 7 నెలలు జైలు శిక్ష అనుభవించి వచ్చిన చెవిరెడ్డి రక్తం పంచుకున్న మోహిత్ రెడ్డికి ఇదంతా ఒక లెక్క కాదు. పోలీసులు కేసు నమోదు చేసిన తర్వాత ముందస్తు బెయిల్ తీసుకుంటే తప్పు చేసినట్లేనా..? అలాగైతే చంద్రగిరి మండలం కూచువారిపల్లె వైసీపీ నేత కొటాల చంద్రశేఖర్ రెడ్డి ఇల్లు, కారును దగ్ధం చేసిన కేసులో 30 మందికి పైగా టీడీపీ నేతలు ముందస్తు బెయిల్ తీసుకున్నారు.. వారంతా అక్కడ తప్పు చేసినట్లేనని అంగీకరిస్తారా..? గతంలో ఎన్నో కేసుల్లో టీడీపీ అధినేత చంద్రబాబు, నారా లోకేష్ కూడా ముందస్తు బెయిల్ తీసుకున్నారని, అలాగని వారంతా తప్పుచేసినట్లేనా..? ఇక చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధి గురించి చెప్పాలంటే అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ మా నాయకుడు చెవిరెడ్డి.. గత ఐదేళ్లలో నియోజకవర్గాన్ని రూ.972 కోట్లతో 5,025 పనులు పూర్తి చేసిన ఘనత ఆయనది.'' అంటూ తిరుపతి రూరల్ మండలం వైఎస్సార్‌సీపీ పేరూరు డివిజన్ అధ్యక్షుడు చెంచు మోహన్ యాదవ్ స్పష్టం చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ తిరుపతి రూరల్ మండల అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి చేసిన ఆరోపణలకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. గ్రామాల్లో చెవిరెడ్డి చేసిన అభివృద్ధి పనుల బోర్డులను చెరిపివేయవచ్చు కానీ, ప్రజల మనసులో నుంచి ఆయన చేసిన మంచిని మాత్రం ఎవ్వరూ చెరపలేరన్నారు. గత ఐదేళ్లలో ప్రతి పక్షంలో ఉన్నప్పుడు పులివర్తి నాని, ఆయన అనుచరులు ఎన్ని కేసులు పెట్టించుకున్నారు, ఎన్ని రోజులు జైళ్లలో ఉన్నారో చెప్పాలన్నారు. పోరాట పటిమతో రాజకీయాల్లోకి వచ్చిన చెవిరెడ్డి కుటుంబంలో బెదిరింపులకు ఎవ్వరూ భయపడరని తెలియజేశారు. మహిళా వర్సిటీ వద్ద జరిగిన గొడవలో చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని, ఆ సమయంలో కలెక్టర్, ఎస్పీలతో కలసి స్ట్రాంగ్ రూమ్ వద్ద వున్నట్లు సీసీ పుటేజీ ఆధారాలు ఉన్నాయన్నారు. కేవలం రాజకీయ కక్షతోనే చెవిరెడ్డిపై దుష్ప్రచారం చేస్తున్నారని స్పష్టం చేశారు. వరాలరెడ్డి, మణి యాదవ్, గంగిరెడ్డి, కార్తీక్, కుమార్ పాల్గొన్నారు.

టీటీడీ విద్యాలయాల్లో పేద పిల్లలకు ప్రవేశానికి వినతి


టీటీడీ ఈఓకు వినతిపత్రం అందిస్తున్న శంకర్ నాయక్

తిరుపతి(అలిపిరి): టీటీడీ విద్యాలయాల్లో పేద విద్యార్థుల ప్రవేశానికి సహకారం అందించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ కోరారు. సోమవారం ఈ మేరకు టీటీడీ ఈఓ శ్యామలరావుకు వినతిపత్రం సమర్పించారు. మౌలిక సదుపాయాలు, సీట్ల కేటాయింపులు డిమాండ్‌కు తగ్గట్టు సరిపోవడం లేదని, అందరికీ అడ్మిషన్‌తో పాటు సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు.

చంద్రచూడ్ సేవలు చిరస్మరణీయం

తిరుపతి సిటీ: సుప్రీంకోర్టు 16వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ వైవీ చంద్రచూడ్ అందించిన సేవలు చిరస్మరణీయమని ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు కొనియాడారు. సోమవారం వర్సిటీ సెనేట్ హాల్‌లో జస్టిస్ చంద్రచూడ్ స్మారక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ మాట్లాడుతూ న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయశాస్త్ర విద్యార్థులకు చంద్రచూడ్ జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన దేశం గర్వించే గొప్ప న్యాయనిపుణులని, ఏడున్నర ఏళ్లకు పైగా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసి రికార్డు సృష్టించారని వెల్లడించారు. అపార న్యాయ పరిజ్ఞానంతో పాటు తన తీర్పుల్లో కరుణ, నైతికత జోడించే వారని, ఆయన ఇచ్చిన తీర్పులు న్యాయవ్యవస్థపై గౌరవాన్ని పెంచాయని వివరించారు. ఎన్నో సంక్లిష్టమైన సమస్యలకు ఆయన పరిష్కారం చూపారని కొనియాడారు. రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ జస్టిస్ చంద్రచూడ్ ఇచ్చినటువంటి తీర్పులు మన దేశ న్యాయవ్యవస్థపై ఎంతో ప్రభావాన్ని చూపాయన్నారు. వర్సిటీలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ప్రస్తుత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఢిల్లీ నుంచి ఆన్‌లైన్‌లో వీక్షించి వర్సిటీ అధికారులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కాలేజ్‌ఆఫ్ ఆర్ట్స్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పద్మనాభం, లా డీన్ కృష్ణయ్య పాల్గొన్నారు.

శ్మశాన స్థల పరిరక్షణకు వినతి


ఆర్‌డీఓ నిషాంత్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న అనిల్‌కుమార్ తదితరులు

తిరుపతి అర్బన్: ఆక్రమణకు గురైన శ్మశాన స్థలాన్ని పరిరక్షించి, తమ ఊరుకు అప్పగించాలని స్థానిక తిమ్మినాయుడుపాళెం ఎస్సీ కాలనీ వాసులు కోరారు. సోమవారం ఈ మేరకు కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో కాలనీకి చెందిన బి.అనిల్‌కుమార్ నేతృత్వంలో కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన సర్వేనంబర్ 199–ఏ లోని 145 సెంట్ల భూమిలో సుమారు వందేళ్లుగా శ్మశానం ఉందన్నారు. గతంలో ప్రభుత్వం సైతం అందులో కర్మక్రియల మండప నిర్మించడంతోపాటు బోరు ఏర్పాటు చేసిందని వెల్లడించారు. అయితే వెంకటరత్నం అనే వ్యక్తి శ్మశాన స్థలంలో 100 సెంట్లు ఆక్రమించుకుని విక్రయించేందుకు యత్నిస్తున్నట్లు ఆరోపించారు. దీనిపై ప్రశ్నిస్తే సమీపంలోని ఫారెస్ట్ రిజర్వ్ స్థలం ఇప్పిస్తామని చెబుతున్నట్లు వెల్లడించారు. పూర్వీకుల కాలం నుంచి అంత్యక్రియలు చేసుకుంటున్న ఈ భూమి మాత్రమే తమకు కావాలని అంటే బెదిరింపులకు దిగుతున్నాడని మండిపడ్డారు. దీనిపై కలెక్టర్ స్పందించారు. సంబంధిత భూమిని పరిశీలించి గ్రామస్తులకు న్యాయం చేయాలని ఆర్‌డీఓ నిషాంత్‌రెడ్డిని ఆదేశించారు. అనంతరం గ్రామస్తులు తిరుపతి ఆర్‌డీఓ కార్యాలయానికి వెళ్లి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.

హక్కులను హరించేందుకే కొత్త చట్టాలు



పౌర చైతన్య వేదిక నూతన కార్యవర్గం

తిరుపతి సిటీ: పౌర హక్కులు హరించి, పోలీసు రాజ్యం తెచ్చేందుకే కేంద్ర ప్రభుత్వం కొత్త క్రిమినల్ చట్టాలను తీసుకువచ్చిందని పౌర చైతన్య వేదిక గౌరవాధ్యక్షుడు రాఘవశర్మ స్పష్టం చేశారు. సోమవారం నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాల ఆవరణలో పలువురు మేధావులు, విద్యావంతులు సమావేశం నిర్వహించారు. రాఘవశర్మ మాట్లాడుతూ నాణ్యమైన విద్య, వైద్యం అందించడంలో ప్రభుత్వాలు విఫలం చెందాయని, వీటి కోసం యువత ప్రశ్నించాల్సి అవసరం ఉందన్నారు. ప్రజా వ్యతిరేక పాలనను నిలదీసేందుకు పౌర చైతన్య వేదిక ఏర్పాటు చేయడం అభినందనీయమని వెల్లడించారు. అనంతరం పౌర చైతన్య వేదిక అధ్యక్షుడు వాకా ప్రసాద్ మాట్లాడుతూ సామాజిక స్పృహ లేని పౌరులుగా యువత తయారు కావడం ఆందోళకమని తెలిపారు. యువతను చైతన్యవంతం చేసి సామాజిక కార్యక్రమాల వైపు ప్రోత్సహించనున్నట్లు చెప్పారు. పౌర చైతన్య వేదిక నూతన కార్యదర్శి ఏఎస్ పరమేశ్వరరావు మాట్లాడుతూ స్థానిక సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తామన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

తిరుపతి లీగల్: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. అధిక మోతాదులో మద్యం తాగి ఆటో నడుపుతున్న తిరుపతి దామినేడుకు చెందిన ఆటో డ్రైవర్ ఎస్వీ బాలాజీరావుకు మూడు రోజులు జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా, మరో కేసులో తిరుపతి, టాటా నగర్‌కు చెందిన జి.శ్రీధర్‌కు రెండు రోజులు జైలు శిక్ష, రూ.10వేలు జరిమానాను న్యాయమూర్తి విధించారు. అలాగే స్వల్ప మోతాదులో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 17 మందికి రూ.10 వేలు చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించినట్లు కోర్టు కానిస్టేబుల్ గిరిబాబు తెలిపారు.

మధ్యవర్తిత్వంపై జడ్జిలకు శిక్షణ


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జిల్లా జడ్జి భీమారావు

తిరుపతి లీగల్: రాయలసీమ జిల్లాలకు చెందిన 30 మంది న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వంపై శిక్షణ తరగతులను సోమవారం జిల్లా జడ్జి భీమారావు ప్రారంభించారు. స్థానిక శ్వేతా భవనంలో ఈనెల 26వ తేదీ వరకు జడ్జిలకు శిక్షణ ఇవ్వనున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి ఎం.గురునాథం, రిటైర్డ్ జడ్జి, సీనియర్ ట్రైనర్ హరీష్ దుదాని, సామాజిక కార్యకర్త న్యాయవాది ట్రైనర్ నీనా కరే పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మోదీ పాలన

తిరుపతి కల్చరల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలన ప్రమాదకరంగా, సంకీర్ణ ధర్మానికి భిన్నంగా సాగుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఓబులేష్ విమర్శించారు. సోమవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీకి దేశ ప్రజలు సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితిని కల్పించారని తెలిపారు. చంద్రబాబు కూడా రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కనిపించడం లేదని ఆరోపించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు హరినాథరెడ్డి, కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, నాయకులు శివారెడ్డి, పార్థసారథి, సీహెచ్ ప్రభాకర్, చిన్నం పెంచలయ్య, రామచంద్రయ్య, నదియా, రాధాకృష్ణ, చిన్నిరాజ్ పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న పీఠాధిపతి


ధ్వజస్తంభం వద్ద జయనిధి తీర్థ స్వామీజీ

తిరుమల: తిరుమల శ్రీవారిని సోమవారం ముల్‌బాగల్ శ్రీపాదరాజ మఠం పీఠాధిపతి జయనిధి తీర్థ స్వామీజీ దర్శించుకున్నారు. తిరుమల బేడి ఆంజనేయ స్వామి వద్దకు చేరుకున్న ఆయనకు టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆకట్టుకున్న నాటకోత్సవాలు

తిరుపతి కల్చరల్: అభినయ ఆర్ట్స్ జాతీయ నాటక, నృత్య పోటీలలో భాగంగా మూడో రోజు సోమవారం మహతి కళాక్షేత్రంలో ప్రదర్శించిన పౌరాణిక, సాంఘిక నాటికలు, శాస్త్రీయ, జానపద బృంద నృత్య పోటీలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన శాస్త్రీయ, జానపద నృత్య పోటీల్లో 200 మంది కళాకారులు నృత్యాభినయం చేసి అలరింపజేశారు. మధ్యాహ్నం శ్రీవాసవి కళాపరిషత్ వారు ప్రదర్శించిన శ్రీమతి కల్యాణం పౌరాణిక పద్య నాటిక ఆధ్యాత్మికత భావాలను రేకెత్తించింది. విజయవాడ అభ్యుదయ ఆర్ట్స్ వారు ప్రదర్శించిన నాలోన నీవే సాంఘిక నాటిక కుటుంబ వ్యవస్థ విశిష్టతను ఆవిష్కరించింది. అనంతరం కళాకారులను నిర్వాహకుడు బీఎస్ రెడ్డి సత్కరించారు.

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న విహారం


తిరుచ్చి భక్తులకు దర్శనమిస్తున్న దేవదేవేరులు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు సోమవారం బంగారు తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. స్వామివారి జన్మనక్షత్రం శ్రవణం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందులో భాగంగా ఉదయం సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను సుందరంగా అలంకరించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేతంగా కల్యాణ వెంకన్నను బంగారు తిరుచ్చిపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా రామచంద్రారెడ్డి జన్మదినోత్సవం


రామచంద్రారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న నేతలు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత రామచంద్రారెడ్డి పుట్టిన వేడుకలను ఆ పార్టీ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణపట్టు ఎంపీటీసీ సభ్యుడు యోగానంద రెడ్డి, ముండ్లపూడి సర్పంచ్ సూరి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక సింధూ సర్కిల్ సమీపంలో పార్టీలకు అతీతంగా అభిమానులు వేడుకలు జరుపుకున్నారు. అనంతరం ఎంపీటీసీ సభ్యుడు నరేష్ రెడ్డి ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శేఖర్, చంద్రశేఖర్ రెడ్డి, వెంకటేష్, హరి, అబ్దుల్లా, ఆర్‌ఆర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

28న పోటీ పరీక్షలపై అవగాహన


మాట్లాడుతున్న డాక్టర్ సురేష్ కుమార్ గిండి

తిరుపతి సిటీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలపై ఎమ్మార్ పల్లె సర్కిల్‌లోని గిండీస్ ఐఏఎస్ అకాడమీలో ఈ నెల 28వ తేదీన ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ చైర్మన్ డాక్టర్ సురేష్ కుమార్ గిండి తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ యూపీఎస్సీ చేపట్టే సివిల్స్, ఎస్ఎస్‌సీతో పాటు ఏపీపీఎస్సీ నిర్వహించే గ్రూప్స్ పరీక్షలు, బ్యాంక్ ఉద్యోగాలకు సంబంధించిన పోటీ పరీక్షలకు అత్యున్నతమైన శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఇందు కోసం ఆదివారం ఉదయం 10.30 నుంచి ఒంటి గంట వరకు విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ ఏడాది ఇప్పటికే విడుదలైన గ్రూప్–1, గ్రూప్–2 ప్రిలిమ్స్‌లో సుమారు 50మందికిపైగా మెయిన్స్ పరీక్షకు అర్హత సాధించడం విశేషమన్నారు. గ్రామీణ ప్రాంతంలో నివసిస్తూ రేషన్‌కార్డు కలిగిన పేద విద్యార్థుల కోసం ఫీజులో 50శాతం రాయితీతో ప్రత్యేక ప్యాకేజీ అందిస్తున్నామని చెప్పారు. అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. వివరాలకు 7815938388 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.